

ఫిర్యాదులు పరిష్కరించాలి

ప్రజావాణికి వచ్చే ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలని కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు అధికారులకు సూచించారు.

- 8లో ▸



గంజాయి స్మగ్లింగ్‌కు చెక్?

గంజాయి స్మగ్లింగ్‌ను నిరోధించడానికి పోలీసులు పకడ్బందీగా చర్యలు తీసుకుంటున్నారు.

- 8లో ▸

వాతావరణం

గరిష్టం/కనిష్టం
32.5 /20.8

ఈదురు గాలులు వీస్తాయి. ఆకాశం పాక్షికంగా మేఘావృతమవుతుంది. అక్కడక్కడ ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షం కురిసే అవకాశాలున్నాయి.

న్యూస్‌రీల్

జూనియర్ సివిల్ జడ్జీల బదిలీ

ఖలీల్‌వాడి : ఉమ్మడి జిల్లాలో పలువురు జూనియర్ సివిల్ జడ్జీలను బదిలీ చేస్తూ మరికొందరిని నియమిస్తూ రాష్ట్ర హైకోర్టు ఉత్తర్వులు జారీచేసింది. నిజామాబాద్ జిల్లా కోర్టులో ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జిగా విధులు నిర్వహిస్తున్న భవ్యకోవిని కోదాడకు బదిలీ చేశారు. ఆమె స్థానంలో రంగారెడ్డి జిల్లా రాజేంద్రనగర్ కోర్టు జూనియర్ సివిల్ జడ్జి రూబినా ఫాతీమా బదిలీపై రానున్నారు. నిజామాబాద్ మొదటి అదనపు జూనియర్ సివిల్ జడ్జి సౌందర్య కుశనపల్లిని నల్గొండకు బదిలీ చేశారు. నిజామాబాద్ నాలుగో అదనపు జూనియర్ సివిల్ జడ్జి గిరిజ తిరందాసును మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కూకట్‌పల్లి మొదటి అదనపు జూనియర్ సివిల్ జడ్జిగా నియమించారు. ఆర్మూర్ ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి రాచర్ల షాలిని నకిరేకల్ కోర్టుకు బదిలీ చేశారు. బోధన్ మొదటి అదనపు జూనియర్ సివిల్ జడ్జి మల్లాది అపర్ణను మహేశ్వరం కోర్టుకు ట్రాన్స్‌ఫర్ చేశారు. కామారెడ్డి జిల్లాలోని కామారెడ్డి మొదటి అదనపు జూనియర్ సివిల్ జడ్జి వెంకటేష్ దుర్వను గోదావరిఖనికి బదిలీ చేశారు. కామారెడ్డి ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జిగా తిరుచినపల్లి ఎస్.పి.భార్గవిని నియమించారు.

జాతీయస్థాయి కరాటేలో గోల్డ్‌మెడల్



మోర్తాడ్ : విశాఖపట్నంలో నిర్వహించిన జాతీయ స్థాయి కరాటే పోటీల్లో ఏర్గట్లకు చెందిన సూదనవేణి లతిక ప్రతిభ కనబరిచి ప్రథమ బహుమతిని సాధించింది. స్థానిక పాఠశాలలో చదువుకుంటున్న లతిక కరాటే శిక్షణ పొందింది. రెండు రోజుల పాటు విశాఖలో నిర్వహించిన జాతీయ స్థాయి పోటీల్లో ప్రథమ బహుమతి సాధించిన లతికను గ్రామస్థులు అభినందిస్తున్నారు.

నేటి నుంచి సైక్లింగ్ శిక్షణ

నిజామాబాద్‌నాగారం: జిల్లా సైక్లింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నేటి నుంచి 31వ తేదీ వరకు వేసవి సైక్లింగ్ శిక్షణ శిబిరం నిర్వహిస్తున్నట్లు సంఘం ప్రధానకార్యదర్శి విజయ్ కాంత్‌రావు సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. డిచ్‌పల్లి మండలం బర్ధీపూర్ శివారులో సైక్లింగ్ శిక్షణ ఉంటుందన్నారు. డీవైఎస్‌వో ముత్తెన్న చేతుల మీదుగా ప్రారంభించడం జరుగుతుందన్నారు. క్రీడాకారులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. పూర్తి వివరాలకు రాఘవేంద్ర 93909 12974 నంబరును సంప్రదించాలన్నారు.

వేగంగా పంటనష్టం వివరాల నమోదు



డొంకేశ్వర్(ఆర్మూర్): వారం రోజులుగా కురుస్తున్న అకాల వర్షాలకు జిల్లాలో దెబ్బతిన్న పంటల వివరాలను వ్యవసాయ శాఖ వేగంగా నమోదు చేస్తోంది. కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు ఈ విషయంలో సీరియస్‌గా ఉండడంతో జిల్లా వ్యవసాయాధికారి తిరుమల ప్రసాద్ సోమవారం పలు మండలాల నుంచి అధికారులను జిల్లా కార్యాలయానికి రప్పించుకున్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన 14 కాలమ్స్‌లలో వివరాలను కంప్యూటర్ల ద్వారా నమోదు చేస్తున్నారు. ఏఈవోలు రైతు వారీగా పేరు, ఊరు, మండలం, పట్టాపాసు పుస్తకం, సర్వే నంబరు, ఆధార్, బ్యాంకు ఖాతా, వివరాలను సేకరించి ఇచ్చారు. వీటిని ప్రభుత్వం ప్రొఫార్మాలో నమోదు చేసి ప్రభుత్వానికి పంపనున్నారు. ఈ నెల 6వ తేదీ వరకు ప్రక్రియను పూర్తి చేయాలని వ్యవసాయ శాఖ లక్ష్యంగా పెట్టుకుంది.

కోలుకోలేని దెబ్బ

రెంజల్ మండలం బోర్గాంలో మోకాలు లోతు నీరు చేరిన పొలంలో వరిని కోస్తున్న రైతులు



రెంజల్ శివారులో మొలకలు వచ్చిన ధాన్యాన్ని చూపిస్తున్న రైతు

కల్లాల్లో తడిసిన ధాన్యం, చేన్లలో నేలకొరిగిన పంటలను చూసి రైతుల కళ్లలో నీళ్లు సుడులు తిరుగుతున్నాయి. ప్రకృతి ఎందుకింత కక్షగట్టిందంటూ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈదురు గాలులు, వడగళ్ల వర్షాలకు పొలాల్లోనే వడ్లు నేల రాలాయి. కోతకొచ్చిన పంట 50 శాతం కూడా చేతికి రాకుండా పోయింది. పెట్టుబడి రాని పరిస్థితి ఏర్పడింది. టార్పాలిన్ల కొరతతో ఏం చేయాలో తోచక చాలా చోట్ల రైతులు వరి కుప్పలను అలాగే వదిలేశారు. నువ్వు పంట 90 శాతం చేన్లలోనే నేలవాలింది.

- పది రోజుల్లో 20వేల ఎకరాల్లో పంట నష్టం
- వరి, నువ్వు పంటలే అధికం..
- రైతులను కంటతడి పెట్టిస్తున్న అకాల వర్షాలు
- యాసంగి కలిసి రాలేదని ఆవేదన చెందుతున్న కర్షకులు

యాసంగిలో పంటనష్టం (ఎకరాల్లో)..

19,500	4,500	800	100	100	700
వరి	నువ్వు	సజ్జ	మామిడి	కూరగాయలు	మక్క

డొంకేశ్వర్ (ఆర్మూర్) : అకాల వర్షాలు, వగడళ్లు రైతులను కోలుకోలేని దెబ్బతీశాయి. ఆదివారం రాత్రి కురిసిన వానకు జిల్లాలో పంటనష్టం మరింత పెరిగింది. రోజురోజుకు పంటనష్టం ఎక్కువ కావడం రైతులతో పాటు వ్యవసాయ అధికారులనూ కలవర పెడుతోంది. యాసంగిలో మొత్తం 25 వేల ఎకరాల పంటలు దెబ్బతినగా, కేవలం ఈ పదిరోజుల్లోనే 20 వేల ఎకరాల దాకా పంటలు నష్టపోయాయి. చేన్లలో ఉన్న వరి, నువ్వు, సజ్జ పంటలకు భారీగా నష్టం వాటిల్లింది. ఆదివారం ఒక్కరోజే కురిసిన వర్షానికి భీమ్‌గల్‌లో 310, సిరికొండలో 844, ధర్పల్లిలో 44, కోటగిరిలో 240, కమ్మర్‌పల్లిలో 20, మాక్లూర్‌లో 260, నిజామాబాద్ సౌత్‌లో 50 ఎకరాల్లో పంట నష్టం జరిగింది. మొత్తంగా రెండు రోజుల్లోనే 1,867 ఎకరాలు దెబ్బతిన్నట్లు వ్యవసాయ శాఖ అంచనా వేసింది.

తేమ పేరుతో దోపిడీ..

తడుస్తున్న వడ్లను రోజు నేర్పుతూ తేమ శాతం తక్కువ ఉండేలా ఎంత ప్రయత్నించినప్పటికీ 20 శాతం వస్తోందని రైతులు వాపోతున్నారు. దీనిని ఆసరాగా చేసుకుని కొనుగోలు కేంద్రాల్లో నిర్వాహకులు పచ్చి వడ్లు కొనబోమని, కడ్తా తీస్తామని స్పష్టం చేస్తున్నారు. దీంతో కొంతమంది రైతులు తడిసిన వడ్లను కూడా విక్రయించడానికి సిద్ధమవుతున్నారు. ప్రయివేటు వ్యాపారులు సైతం తక్కువ ధరకు ఇస్తేనే కొనుగోలు చేస్తామని రైతులకు చెబుతున్నారు. దీంతో రైతులు ఏం చేయాలో పాలుపోక ఆందోళన చెందుతున్నారు.

దిక్కుతోచడం లేదు..



వర్షాలకు కోసిన ధాన్యం కల్లాలోనే రోజూ తడుస్తోంది. ఎంత ఎండబెట్టిన తేమ శాతం తక్కువ రావడం లేదు. ఏం జేయాల్నో దిక్కుతోచడం లేదు. ధాన్యం ఆరబెట్టడానికి మూడింతలు శ్రమించాల్సి వస్తోంది. యాసంగిలో పంటల పరిస్థితి ఏం బాగోలేదు.

– సాయరెడ్డి, మారంపల్లి, డొంకేశ్వర్ మండలం



డొంకేశ్వర్ మండలం అన్నారంలో నేలకొరిగిన నువ్వు పంట



తాడ్‌బిలోలి శివారులో ధాన్యంపై కప్పిన టార్పాలిన్లపై చేరిన నీటిని తొలగిస్తున్న రైతు



తాడెంలో తడిసిన ధాన్యాన్ని ఆరబోస్తున్న రైతు

15.8 మిల్లీమీటర్ల వర్షపాతం

మరో రెండ్రోజులు వర్షాలు!

సుభాష్‌నగర్ : జిల్లాలో ఆదివారం ఉదయం నుంచి సోమవారం ఉదయం వరకు 15.8 మిల్లీమీటర్ల సగటు వర్షపాతం నమోదైంది. సాయంత్రం కూడా జిల్లావ్యాప్తంగా పలు మండలాల్లో ఉరుములు, మెరుపులతో కూడిన భారీగా వర్షం కురిసింది. మాక్లూర్, కమ్మర్‌పల్లి, మోర్తాడ్, మెండోరా, భీంగల్, ఎడపల్లి, ధర్పల్లి, కోటగిరి, రెంజల్, తదితర మండలాల్లో అధిక వర్షం కురిసింది. చందూర్, మోస్రా, మోపాల్, ఏర్గట్లలో స్వల్పంగా కురిసింది. వరి, మామిడి, నువ్వు పంటలు తీవ్రంగా దెబ్బతిన్నాయి. రానున్న రెండ్రోజులు జిల్లాలో అక్కడక్కడా ఉరుములు, మెరుపులతో కూడిన వడగళ్ల వర్షాలు కురుస్తాయని వాతావరణశాఖ అధికారులు పేర్కొంటున్నారు.

జిల్లాలో నమోదైన వర్షపాతం

మండలం	మి.మీ.	భీమ్‌గల్	31.7
నవీపేట	19.2	ఎడపల్లి	31.5
బాల్కొండ	8.0	వేల్పూర్	19.7
మెండోర	25.8	డిచ్‌పల్లి	5.0
నందిపేట	7.9	బోధన్	17.6
ఏర్గట్ల	1.5	వర్ని	7.6
మోర్తాడ్	30.0	సిరికొండ	17.1
మాక్లూర్	33.8	మోపాల్	0.5
కమ్మర్‌పల్లి	32.7	నిజామాబాద్‌సౌత్	7.4
ముప్కాల్	11.2	నిజామాబాద్‌నార్త్	14.9
జక్రాన్‌పల్లి	8.0	కోటగిరి	28.4
ఆర్మూర్	19.2	ఇందల్వాయి	10.3
రెంజల్	21.2	ధర్పల్లి	22.0
నిజామాబాద్‌రూరల్	16.9	రుద్రూర్	10.5

ఎంసెట్‌లో ప్రత్యేక శిక్షణ..

- పరీక్షకు సన్నద్ధమవుతున్న కేజీబీవీ విద్యార్థులు
- సబ్జెక్టు ఎక్స్‌పర్ట్‌లతో ఆన్‌లైన్ పద్ధతిలో శిక్షణ తరగతులు

ఆర్మూర్: కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయ విద్యార్థులను ఉన్నతంగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా ఎంసెట్ శిక్షణ అందిస్తున్నారు. ఇంటర్ ద్వితీయ సంవత్సరం పూర్తి చేసుకున్న విద్యార్థినుల కు ఎంసెట్‌లో ఉత్తమ ర్యాంకు సాధించేలా ఉచిత శిక్షణ ఇస్తున్నారు. ఇందులో భాగంగా రాష్ట్రస్థాయిలో అధికారులు వీరికి ఆన్‌లైన్ పద్ధతిలో ప్రత్యేక శిక్షణనిస్తుండగా స్థానిక సబ్జెక్టు టీచర్లు పర్యవేక్షిస్తున్నారు.

జిల్లావ్యాప్తంగా 25 కేజీబీవీలు..

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా బాలికా విద్యను ప్రోత్సహించడంలో భాగంగా సమగ్ర శిక్ష పరిధిలో జిల్లా వ్యాప్తంగా 25 కేజీబీవీలను నిర్వహిస్తున్నారు. అందులో తొమ్మిది కేజీబీవీలను ఇంటర్మీడియట్ వరకు అప్‌గ్రేడ్ చేశారు. వీటిలో ఆర్మూర్, మాక్లూర్, డిచ్‌పల్లి, నిజామాబాద్, బోధన్, భీమ్‌గల్ కేజీబీవీల్లో ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం పూర్తి చేసుకున్నారు. ఈ విద్యా సంవత్సరం ఎంపీసీ, బైపీసీ, ఎంపీహెచ్(డబ్ల్యూ) ద్వితీయ సంవత్సరం పూర్తి చేసుకున్న విద్యార్థినులు 123 మంది ఎంసెట్ పరీక్ష రాయడానికి దరఖాస్తు చేసుకున్నారు. వీరికి రాష్ట్ర స్థాయి అధికారులు నియమించిన నిష్ణాతులైన సబ్జెక్టు టీచర్లచే ప్రతిరోజూ ఆన్‌లైన్ పద్ధతిలో శిక్షణ తరగతులను నిర్వహిస్తున్నారు. విద్యార్థినులు ఇళ్ల వద్దే శిక్షణ తరగతులకు హాజరవుతున్నారు. రానున్న రోజుల్లో ఇంజినీరింగ్, అగ్రికల్చర్ బీఎస్సీ, హార్టికల్చర్ ఫారెస్ట్ సైన్స్, బీవీఎస్సీ (బ్యాచిలర్ ఆఫ్ వెటర్నరీ సైన్స్ అండ్ యానిమల్ హస్బెండరీ), ఫిషరీస్ సైన్స్, బీటెక్ ఫుడ్ టెక్నాలజీ, బీటెక్ బయో టెక్నాలజీ, బీ ఫార్మసీ, ఫార్మా-డి, అగ్రికల్చర్ ఇంజినీరింగ్, బీటెక్ బయోటెక్నాలజీ, బీటెక్ డెయిరీ టెక్నాలజీ, బీటెక్ ఫుడ్ టెక్నాలజీ తదితర ఉన్నత చదువుల్లో సీటు సాధించాలనే లక్ష్యంతో విద్యార్థినులు కష్టపడి చదువుతున్నారు.



పెర్కిట్‌లోని కేజీబీవీ భవనం

విద్యార్థినులకు శిక్షణ ఇస్తున్నాం



ఎంసెట్‌లో ర్యాంకు సాధించడమే లక్ష్యంగా కేజీబీవీలకు చెందిన విద్యార్థినులకు ఆన్‌లైన్‌లో ప్రత్యేక శిక్షణనిస్తున్నాం. మంచి ఫలితాలు వస్తాయనే నమ్మకంతో ఉన్నాం.

– సింగం వనిత, జీసీడీవో, సమగ్ర శిక్ష, నిజామాబాద్

బాలికలకు ఎంతో ఉపయోగకరం



కేజీబీవీల బాలికలకు ఎంసెట్ ప్రవేశ పరీక్ష కోసం ఆన్‌లైన్ పద్ధతిలో నిర్వహిస్తున్న శిక్షణ తరగతులు వారికి ఎంతగానో ఉపయోగకరంగా ఉన్నాయి. సబ్జెక్ట్ టీచర్లు ఎప్పటికప్పుడు వారిని గైడ్ చేస్తున్నారు.

–గంగామణి, స్పెషల్ ఆఫీసర్, కేజీబీవీ, ఆర్మూర్


ర్యాంకు సాధిస్తాను



కేజీబీవీలో ఇంటర్ పూర్తి చేసుకొని ఇంజినీరింగ్ చదవాలన్న నా ఆశయానికి సమగ్ర శిక్ష ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఆన్‌లైన్ క్లాసులు ఎంతగానో ఉపయోగకరంగా ఉన్నాయి. ఎంసెట్‌లో ర్యాంకు సాధిస్తానన్న నమ్మకం పెరిగింది.

-శ్రీనిధి, విద్యార్థిని, కేజీబీవీ, ఆర్మూర్

కొత్త కమిషనర్ వచ్చేదెప్పుడు!



- నెల దాటినా కొత్త సీపీని నియమించని పోలీస్‌శాఖ
- నిర్మల్ ఎస్పీకి ఇన్‌చార్జి బాధ్యతలు

ఖలీల్‌వాడి: నిజామాబాద్ పోలీస్ కమిషనర్‌గా నాగరాజు పదవీ విరమణ చేసి నెలరోజులు గడుస్తున్నా ఇప్పటివరకు కొత్త పోలీస్‌కమిషనర్‌ను నియామించకపోవడం జిల్లాలో చర్చనీయాంశంగా మారింది. జిల్లాకు చెందిన ప్రజాప్రతినిధుల మధ్య సయోధ్య లేకపోవడంతో సీపీ ఎంపిక వాయిదా పడుతున్నట్లు చర్చ జరుగుతోంది. సామాన్య ప్రజలకు స్థానిక పోలీస్‌స్టేషన్‌లో న్యాయం లభించకపోతే సీపీని ఆశ్రయిస్తారు. సీపీ లేకపోవడంతో మా సమస్యలను ఎవరికి చెప్పాలనే జిల్లా ప్రజలు అంటున్నారు. కొందరు ఐపీఎస్‌లు జిల్లాకు చెందిన ప్రజాప్రతినిధులను కలిసి సీపీ పోస్టుకోసం కలిసి విన్నవించినట్లు తెలుస్తోంది. ప్రస్తుతం నిర్మల్ ఎస్పీగా పని చేస్తున్న ప్రవీణ్‌కుమార్‌కు నిజామాబాద్ పోలీస్‌కమిషనర్‌గా ఇన్‌చార్జి బాధ్యతలు ఇచ్చారు.

సీపీ పోస్టు కోసం ఇద్దరి పోటీ

నిజామాబాద్ సీపీ పోస్టు కోసం ఇద్దరు ఐపీఎస్‌లు పోటీ పడుతున్నట్లు తెలిసింది. సీఎంవోలో పని చేస్తున్న శ్రీనివాస్‌రావు, వికారాబాద్ ఎస్పీగా పని చేస్తున్న కోటి రెడ్డిలు పోటీలో ఉన్నట్లు జిల్లాలో ప్రచారం జరుగుతోంది. ఈ ఫైల్ డీజీపీ వద్దకు చేరినట్లు తెలుస్తోంది. అంబేడ్కర్ విగ్రహం, సచివాలయం ప్రారంభోత్సవాలతో బిజీగా ఉన్న ప్రజాప్రతినిధులు వారం, పదిహేను రోజుల్లో సీపీ ఎంపిక చేయనున్నట్లు తెలుస్తోంది. ప్రస్తుతం నిర్మల్ ఎస్పీగా ఉన్న ప్రవీణ్‌కుమార్‌ను నిజామాబాద్‌కు బదిలీ చేసే అవకాశం కూడా ఉన్నట్లు ప్రచారం ఉంది.

ప్రజాప్రతినిధుల మధ్య సయోధ్య కుదిరేనా!

జిల్లాకు కొత్తగా వచ్చే పోలీస్ కమిషనర్ రెండు నుంచి మూడేళ్లు పదవిలో కొనసాగుతారు. దీంతో ప్రజాప్రతినిధులు తమకు అనుకూలంగా ఉండే వారి కోసం అన్వేషణ చేస్తున్నట్లు తెలుస్తోంది. శాసనసభ ఎన్నికలు దగ్గరలో ఉండడంతో పోలీస్‌బాస్ తమకు అనుకూలంగా ఉంటే ఎలాంటి ఇబ్బందులు ఉండవని భావిస్తున్నారు. దీంతో కొత్త కొత్వాల్ కోసం మల్లాగుల్లాలు పడుతున్నట్లు తెలిసింది. కొత్త సీపీ కోసం ప్రజాప్రతినిధుల మధ్య సయోధ్య కుదిరినట్లు తెలుస్తోంది.



నగరంలో ఐఎఫ్‌టీయూ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహిస్తున్న కార్మికులు

ఘనంగా మే డే

కార్మిక దినోత్సవాన్ని సోమవారం జిల్లా వ్యాప్తంగా ఘనంగా నిర్వహించారు. వివిధ కార్మిక సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

-9లో..

పీఎఫ్ఐ కేసులో పలువురికి నోటీసులు

- ఇప్పటి వరకు 60 మందికి..
- కాల్ డేటా ఆధారంగా విచారణ

ఖలీల్ వాడి: నిషేధిత పాపులర్ ఫ్రంట్ ఆఫ్ ఇండియా(పీఎఫ్ఐ) సభ్యులతో సంబంధాలు ఉన్న వారికి ఎన్ఐఏ నోటీసులు జారీ చేస్తోంది. ఇప్పటికే పలువురిని అరెస్ట్ చేయగా వారి కాల్‌డేటా ఆధారంగా ఎన్ఐఏ ఇచ్చిన వివరాలతో స్థానిక పోలీసులు కొందరికి నోటీసులు జారీ చేశారు. 2022 జూలై 4న నగరంలోని 6వ టౌన్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. అనంతరం ఈ కేసును జిల్లా పోలీసులు ఆగస్టు 26న ఎన్ఐఏకు అప్పగించారు. దీంతో విచారణ జరిపిన అధికారులు జిల్లా కేంద్రంలోని అబ్దుల్ ఖాదర్, షేక్ ఇమ్రాన్, షేక్ సాదుల్లా, అబ్దుల్ అహ్మద్, మహ్మద్ అబ్దుల్ ముబీన్, షేక్ ఇమ్రాన్‌లను గతంలోనే అరెస్ట్ చేసిన విషయం తెలిసిందే. వీరిని అరెస్ట్ చేసి ల్యాప్‌టాప్‌లు, సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. వారి ఫోన్‌లోని కాల్ డేటా ఆధారంగా ఎన్ఐఏ అధికారులు నోటీసులు జారీ చేశారు. నోటీసులు జారీ చేసిన పలువురిని హైదరాబాద్‌లోని ఎన్ఐఏ కార్యాలయంలో విచారణ చేసినట్లు తెలిసింది. పీఎఫ్ఐలో చేరికల గురించి, వారితో ఉన్న సంబంధాలు, పరిచయం వంటి వివరాలతో శిక్షణకు సంబంధించిన అంశాలపై ఎన్ఐఏ అధికారులు కూపీ లాగుతున్నట్లు సమాచారం. తాజాగా జిల్లా కేంద్రంలోని నిజాంకాలనీకి చెందిన హైదర్‌తో పాటు అహ్మద్ బజార్‌కు చెందిన యువకుడికి మూడు రోజుల క్రితం నోటీసులు అందించినట్లు తెలిసింది. ఇప్పటి వరకు జిల్లా కేంద్రంలో 60 మందికి ఎన్ఐఏ నోటీసులు అందించినట్లు సమాచారం. వీరిలో కొందరు విచారణకు హాజరయ్యారని తెలిసింది. ఎన్ఐఏ నోటీసులు అందించడం జిల్లాలో మళ్లీ కలకలం రేపుతోంది.

కడ్తా పేరుతో తరుగు తీస్తున్నారు..

■ ఈ సీఈవో మాకొద్దు.. రైతుల ఆగ్రహం

డిచ్‌పల్లి: తేమశాతం ఎక్కువగా ఉందని సాకు చూపి క్వింటాలు వడ్లకు 6 కిలోల వరకు తరుగు తీస్తున్నారని డిచ్‌పల్లి మండలం ఘన్‌పూర్ రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. డిచ్‌పల్లి సొసైటీ ఆధ్వర్యంలో ఘన్‌పూర్‌లో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రం వద్ద రైతులు సోమవారం సొసైటీ చైర్మన్ గజవాడ జైపాల్‌తో సమావేశమయ్యారు. కొనుగోలు కేంద్రం ఇన్‌చార్జి క్లర్క్ బండి రవీందర్ వడ్లు కాంటా వేయడంలో అక్రమాలకు పాల్పడుతున్నట్లు ఆరోపించారు. తేమశాతం ఎక్కువ ఉన్నా తమ బంధువుల వడ్లు కాంటా వేస్తున్నాడని, ఇతర రైతుల వడ్లను కాంటా వేయకుండా ఇబ్బందులకు గురి చేస్తున్నాడని రవీందర్‌పై రైతులు మండిపడ్డారు. ఈ విషయమై సొసైటీ సీఈవో కిషన్‌కు తెలియజేసినా పట్టించుకోకుండా వెళ్లిపోయారని ఆరోపించారు.ఈ సీఈవో మాకొద్దని రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు. రైతుల ఆరోపణలపై చైర్మన్ జైపాల్ స్పందించారు. వెంటనే రవీందర్‌ను విధుల నుంచి తొలగిస్తున్నట్లు తెలిపారు. రైతులందరూ మాట్లాడుకుని ఘన్‌పూర్‌కు చెందిన ఇద్దరి పేర్లు సూచిస్తే వారిని కొనుగోలు కేంద్రం వద్ద ఇన్‌చార్జీలుగా నియమిస్తామని జైపాల్ తెలిపారు. ప్రభుత్వ నిబంధల ప్రకారం తేమశాతం 17 ఉండాలని అంతకంటే ఎక్కువగా ఉంటే రైస్ మిల్లర్లు ధాన్యం తీసుకోవడం లేదని స్పష్టం చేశారు. రైతులు వడ్లను బాగా ఆరబెట్టి సరైన తేమ శాతం వచ్చిన తర్వాతే కాంటా చేయాలని సూచించారు.



రవీందర్‌పై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న రైతులు

క్లుప్తంగా

పోటీ పరీక్షలకు ఉచిత శిక్షణ

నిజామాబాద్‌అర్బన్‌: స్టడీ సర్కిల్‌ ఆధ్వర్యంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ అభ్యర్థులకు పోటీ పరీక్షలకు ఉచితంగా శిక్షణ ఇవ్వనున్నట్లు స్టడీ సర్కిల్‌ డైరెక్టర్‌ విజయ్‌కుమార్‌ ఒక ప్రకటనలో తెలిపారు. నగరంలోని నాందేడ్‌వాడలో గల ఎస్సీ బాలుర హాస్టల్లో ఉమ్మడి జిల్లాలో నిరుద్యోగులకు ఉచిత శిక్షణ ఇస్తామన్నారు. రాష్ట్ర ఉద్యోగాలు, ఆర్‌ఆర్‌బీ,బ్యాంకింగ్‌ పరీక్షలకు శిక్షణ ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. శిబిరంలో చేరడానికి ఆసక్తిగల అభ్యర్థులు ఈనెల 14 లోపు రిజిస్టర్‌ చేసుకోవాలన్నారు. ఈనెల 21న నిజామాబాద్‌లో ప్రవేశ పరీక్ష ఉంటుందని, మెరిట్‌ అభ్యర్థులను శిక్షణకు ఎంపిక చేస్తామన్నారు. వివరాలకు 9491468799, 9951199460 నంబర్లను సంప్రదించాలని సూచించారు.

కేజీబీవీ ఉద్యోగులకు వేసవి సెలవులు ఇవ్వాలి

నిజామాబాద్‌అర్బన్‌: కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాల్లో(కేజీబీవీ)ల్లో పని చేస్తున్న ఉపాధ్యాయులకు వేసవి సెలవులు ఇవ్వకుండా, పాఠశాలలకు వెళ్లాలని సమగ్ర శిక్షా స్టేట్‌ ప్రాజెక్ట్‌ అధికారి ఆదేశాలు జరీచేయడం సరి కాదని డీటీఎఫ్‌ రాష్ట్ర ఉపాధ్యక్షుడు శాంతన్‌ ఒక ప్రకటనలో డిమాండ్‌ చేశారు. అన్ని పాఠశాలల మాదిరే కేజీబీవీ ఉద్యోగులకు కూడా వేసవి సెలవులు ఇవ్వాలన్నారు.

రక్తదానంతో ప్రాణాలు కాపాడుదాం



ఖలీల్‌వాడి: జిల్లా న్యాయసేవాధికార సంస్థ న్యాయవివాదాలను పరిష్కరించడంతోపాటు సామాజిక సేవారంగంలో కూడా తనవంతు బాధ్యతను పోషిస్తున్నదని సంస్థ చైర్‌ పర్సన్‌, జిల్లా జడ్జి సునీత కుంచాల అన్నారు. జిల్లా కోర్టు ఆవరణలో గల న్యాయసేవ సదన్‌లో మే డే సందర్భంగా రక్తదాన శిబిరాన్ని ప్రారంభించి ఆమె మాట్లాడారు. రక్తదానంతో ప్రాణాలు కాపాడొచ్చన్నారు. కార్మికుల సంక్షేమం కోసం ఎన్నో చట్టాలు ఉన్నాయని,వాటిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. జిల్లాలో బీడీ కార్మికులు పెద్దమొత్తంలో ఉన్నారని,న్యాయసహాయం అవసమైతే అందించడానికి న్యాయసేవా సంస్థ సిద్ధంగా ఉందన్నారు. న్యాయసేవా సంస్థ కార్యదర్శి, సీనియర్‌ సివిల్‌ జడ్జి పద్మావతి, బార్‌ అసోసియేషన్‌ అధ్యక్షుడు దేవదాసు, వైద్యులు తిరుపతి, స్మిత పాల్గొన్నారు.

3న లక్కీ డ్రా

నిజామాబాద్‌అర్బన్‌: హైదరాబాద్‌ పబ్లిక్‌ స్కూల్‌లో ప్రవేశాల కోసం దరఖాస్తు చేసుకున్న వారికి ఈ నెల 3న లక్కీ డ్రా నిర్వహిస్తున్నట్లు జిల్లా గిరిజన అభివృద్ధి అధికారి నాగోరావు ఒక ప్రకటనలో తెలిపారు. పాఠశాలలో ఒకటో తరగతి ఇంగ్లిష్‌ మీడియంలో ప్రవేశాలకు ఎస్టీ విభాగంలో బాలురు మూడు సీట్లు, బాలికలు మూడు సీట్లు ఇది వరకే దరఖాస్తులను స్వీకరించామన్నారు.

ఫిర్యాదులు పరిష్కరించాలి



వినతులు స్వీకరిస్తున్న కలెక్టర్‌ రాజీవ్‌గాంధీ హనుమంతు, అధికారులు

సుభాష్‌నగర్‌: ప్రజావాణి కార్యక్రమానికి ప్రాధాన్యతనిస్తూ ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలని కలెక్టర్‌ రాజీవ్‌గాంధీ హనుమంతు అధికారులకు సూచించారు. కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి 49 ఫిర్యాదులు అందాయి. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ఫిర్యాదుదారులు తమ సమస్యలను కలెక్టర్‌తోపాటు అదనపు కలెక్టర్‌ చంద్రశేఖర్‌, డీఆర్డీఓ చందర్‌, జెడ్పీ సీఈఓ గోవింద్‌, నిజామాబాద్‌ ఆర్డీఓ రవిలకు విన్నవిస్తూ అర్జీలు సమర్పించారు. కాగా అర్జీలను పెండింగ్‌లో పెట్టకుండా ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ సమస్యలు పరిష్కరించాలని కలెక్టర్‌ ఆదేశించారు.

సర్వే అధికారులపై చర్యలు తీసుకోవాలి

లోకాయుక్త ఆదేశాల ప్రకారం తమ భూమిని కబ్జాదారుల నుంచి కాపాడాలని, సర్వే అండ్‌ ల్యాండ్‌ రికార్డ్‌ ఏడీపై చర్యలు తీసుకోవాలని నగరానికి చెందిన అయేషా ఫాతిమా కోరారు. ఈమేరకు సోమవారం కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. బోధన్‌ రోడ్డులోని అశోక్‌నగర్‌లో సర్వేనంబర్‌ 213, 214లో తమ భూమికి హద్దులు చూపించాలని అధికారులను కోరినా ఫలితం లేకుండా పోయిందన్నారు. చివరకు న్యాయం కోసం లోకాయుక్తను ఆశ్రయించగా, సర్వేనంబర్‌లో భూముల కొలతలు నిర్వహించాలని లోకాయుక్త సర్వే అండ్‌ ల్యాండ్‌ రికార్డ్‌ అధికారులను ఆదేశించిందని గుర్తుచేశారు. కానీ అధికారులు లోకాయుక్త ఆదేశాలను పట్టించుకోకుండా ప్రత్యర్థి వర్గానికి అనుకూలంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు.



మాట్లాడుతున్న ఆయేషా ఫాతిమా

కామారెడ్డిలో 27 ఫిర్యాదులు

కామారెడ్డి క్రైం: ప్రజావాణిలో వచ్చిన ఫిర్యాదులను సంబంధితశాఖల అధికారులు తక్షణమే పరిష్కరించాలని రెవెన్యూ అదనపు కలెక్టర్‌ చంద్రమోహన్‌ అధికారులకు సూచించారు. కామారెడ్డి కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి 27 ఫిర్యాదులు వచ్చాయి. అదనపు కలెక్టర్‌ చంద్రమోహన్‌ మాట్లాడుతూ.. ఫిర్యాదులపై సానుకూలంగా స్పందించడంతో పాటు సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో ఏవో రవీందర్‌, అధికారులు పాల్గొన్నారు.



కామారెడ్డిలో ఫిర్యాదులు స్వీకరిస్తున్న అధికారులు

గంజాయి స్మగ్లింగ్‌కు చెక్‌?

- స్మగ్లింగ్‌లో కీలకపాత్ర పోషిస్తున్న వారిపై దృష్టి సారించిన పోలీసులు
- మోర్తాడ్‌లో అరెస్టయిన ఇద్దరు ప్రధాన నిందితులు



గంజాయి నిందితులను పట్టుకున్న ఏఎస్సైకి రివార్డు అందిస్తున్న ఏసీపీ ప్రభాకర్‌రావు (ఫైల్‌)

మోర్తాడ్‌: గంజాయి స్మగ్లింగ్‌ను నిరోధించడానికి పోలీసులు పకడ్బందీగా చర్యలు తీసుకుంటున్నారు. గంజాయి అక్రమ రవాణాలో కీలకపాత్ర పోషిస్తున్నవారి ఆట కట్టిస్తే ఈ దందాకు చెక్‌ పెట్టవచ్చని భావించిన పోలీసులు అదే దిశలో అడుగులు వేస్తున్నారు. శుక్రవారం మోర్తాడ్‌లో గంజాయి ముఠా సభ్యులు నలుగురిని అరెస్టు చేయగా ఇందులో కీలకమైన ఇద్దరు వ్యక్తులు ఉన్నారని పోలీసులు వెల్లడించారు. నిందితుల వద్ద 500 గ్రాముల గంజాయి, నాలుగు సెల్‌ఫోన్‌లు, మూడు ద్విచక్ర వాహనాలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఒక ఇంటిలో గంజాయి సేవిస్తున్నారనే పక్కా సమాచారంతో మెరుపుదాడి చేసిన పోలీసులకు నలుగురు వ్యక్తులు పట్టుబడ్డారు. ఇందులో గంజాయి స్మగ్లింగ్‌లో ఆరితేరిన ఇద్దరు వ్యక్తులను పోలీసులు గుర్తించడం విశేషం. బాల్కొండ నియోజకవర్గంలోని వివిధ గ్రామాల్లో గంజాయి విక్రయాలు కొన్నేళ్ల నుంచి అడ్డు అదుపులేకుండా సాగుతున్నాయి. అధికార పార్టీ నాయకుల తీరుపై అనేక విమర్శలు వెల్లువెత్తాయి. గంజాయి ముఠాల్లో ప్రధానమైన వారిని అరెస్టు చేయాలనే డిమాండ్‌ మొదటి నుంచి వినిపిస్తుంది. గంజాయి కేసులకు సంబంధించి పోలీసులు మొదట ఉదాసీనతతో వ్యవహరించినా ఇప్పుడు మాత్రం కఠినంగానే వ్యవహరిస్తుండటం గమనార్హం. గంజాయి విక్రయాల్లో ముఖ్యులైనవారిని పట్టుకుంటేనే ఈ స్మగ్లింగ్‌కు అడ్డుకట్ట వేయవచ్చని పోలీసులు ఆశించారు. ఈ దశలోనే గంజాయికి బానిసలైన వారి సహకారంతో ముఠా సభ్యులను గుర్తించి వారి వివరాలను నమోదు చేసుకుంటున్నారు. ఇప్పటి వరకు గంజాయి వ్యాపారంలో నామమాత్రంగా వ్యవహరించినవారినే పోలీసులు పట్టుకోగా ఇప్పుడు మాత్రం ఎవ్వరి మాట లెక్కచేయకుండా కీలకపాత్ర పోషించే వారిపై నిఘా ఉంచడం విశేషం. గంజాయి విక్రయాలకు చెక్‌ పెట్టడానికి పోలీసులు తీసుకుంటున్న చర్యలు సత్ఫలితాలను ఇవ్వాలని అనేక మంది కోరుతున్నారు.

ఫుట్‌ ఓవర్‌ బ్రిడ్జి నిర్మాణం కోసం పరిశీలన



డిచ్‌పల్లి రైల్వేస్టేషన్‌లో రైల్వే ఇంజినీర్‌ ప్రసాద్‌తో మాట్లాడుతున్న ఎంపీపీ గద్దె భూమన్న

డిచ్‌పల్లి: డిచ్‌పల్లి రైల్వే స్టేషన్‌ ఆవరణలో ఫుట్‌ ఓవర్‌ బ్రిడ్జి, రైల్వే గేటు వద్ద రైల్వే అండర్‌ బ్రిడ్జి (ఆర్‌యూబీ) నిర్మాణం కోసం రైల్వే ఇంజినీరింగ్‌ అధికారులు సోమవారం పరిశీలన చేశారు. ఎంపీపీ గద్దె భూమన్న, వైస్‌ ఎంపీపీ కులాచారి శ్యాంరావు, ఘన్‌పూర్‌ వీడీసీ సభ్యులతో కలిసి రైల్వే ఇంజినీర్‌ ప్రసాద్‌, స్టేషన్‌ ఆవరణతో పాటు రైల్వే గేటు వద్ద పరిశీలించారు. అవసరమైన కొలతలు తీసుకున్నారు. సాంకేతికంగా ఆర్‌యూబీ నిర్మాణం వీలుకాదని ఇంజినీర్‌ స్పష్టం చేశారు. స్టేషన్‌ వద్ద మనుషులు, ద్విచక్రవాహనాలు దాటేందుకు ఫుట్‌ ఓవర్‌ బ్రిడ్జి నిర్మాణం కోసం ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నట్లు తెలిపారు. ఇందుకు ఎంపీ కొంత నిధులు మంజూరు చేయాల్సి ఉంటుందన్నారు. అనంతరం ఎంపీపీ భూమన్న మాట్లాడుతూ.. డిచ్‌పల్లి రైల్వేస్టేషన్‌కు అటువైపు ప్రభుత్వ కార్యాలయాలు, ఆస్పత్రి, జూనియర్‌ కాలేజీ, పాఠశాలలతో పాటు ఘన్‌పూర్‌, ముల్లంగి(ఐ), కులాస్‌పూర్‌ తదితర గ్రామాలున్నాయన్నారు. దీంతో నిత్యం ఎంతో మంది పట్టాల మీదుగా రాకపోకలు సాగిస్తున్నారని చెప్పారు. ఈ విషయాన్ని తాము ఎంపీ అర్వింద్‌ దృష్టికి తీసుకెళ్లగా రైల్వే ఉన్నతాధికారిని కలిసి ఫుట్‌ ఓవర్‌బ్రిడ్జి నిర్మాణం కోసం విన్నవించారని తెలిపారు. ఎంపీ వినతి, ఉన్నతాధికారుల ఆదేశాలతో రైల్వే అధికారులు ఫుట్‌ఓవర్‌బ్రిడ్జి నిర్మాణం కోసం స్థల పరిశీలన చేయడం హర్షనీయమన్నారు. స్టేషన్‌ సూపరింటెండెంట్‌ రవిశంకర్‌, బీజేపీ నాయకులు చంద్రకాంత్‌, లక్ష్మణ్‌, విఠల్‌, వీడీసీ పాల్గొన్నారు.

యూనివర్సిటీ బంద్‌ విజయవంతం



నాన్‌ టీచింగ్‌ సిబ్బందిని బయటకు వెళ్లాలని కోరుతున్న విద్యార్థి సంఘాల నాయకులు

తెయూ(డిచ్‌పల్లి): తెలంగాణ యూనివర్సిటీ విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో సోమవారం చేపట్టిన వర్సిటీ బంద్‌ విజయవంతం అయింది. విద్యార్థి సంఘాల నాయకులు నినాదాలు చేస్తూ పరిపాలన భవనం, కళాశాలలోని అన్ని విభాగాలు తిరుగుతూ టీచింగ్‌, నాన్‌ టీచింగ్‌ ఉద్యోగులందరినీ బయటకు పంపించి తలుపులు మూసి నిరసన తెలియజేశారు. విద్యార్థి సంఘాల నాయకులు సంతోష్‌, నవీన్‌, అక్షయ్‌ మాట్లాడుతూ.. యూనివర్సిటీ ఖజానా మొత్తం ఖాళీ చేసిన అవినీతి వీసీ రవీందర్‌ మాకొద్దన్నారు. టీచింగ్‌, నాన్‌ టీచింగ్‌ ఉద్యోగులకు జీతాలు ఇవ్వలేని పరిస్థితిలో యూనివర్సిటీ ఉందని, దీనిని కాపాడుకునేందుకు అందరు సహకరించాలని కోరారు. వీసీని తొలగించి, యూనివర్సిటీ ప్రక్షాళన చేసే వరకు తమ పోరాటం ఆగదన్నారు.

బార్‌ ఆత్మీయత ఎనలేనిది



ఖలీల్‌వాడి: జూనియర్‌ సివిల్‌ జడ్జిలుగా నియామకం తర్వాత తొలిసారి నిజామాబాద్‌ జిల్లా కోర్టులో విధులు నిర్వహించడం తమ జీవితాల్లో మరిచిపోలేని మధురస్మృతిగా నిలిచిపోతుందని జూనియర్‌ సివిల్‌ జడ్జిలు భవ్య కోవి, గిరిజ తిరందాసు, సౌందర్య కుశనపల్లి అన్నారు. సోమవారం నిజామాబాద్‌ బార్‌ అసోసియేషన్‌ ఏర్పాటు చేసిన వీడ్కోలు సమావేశంలో వారు మాట్లాడారు. విధుల నిర్వహణలో బార్‌ నుంచి నేర్చుకున్నదే ఎక్కువవని, నేర్చుకునే మహాభాగ్యం కల్పించిన నిజామాబాద్‌ బార్‌ అసోసియేషన్‌ను జీవితంలో ఎప్పటికి మార్చిపోలేమన్నారు. బదిలీపై వెళుతున్న జూనియర్‌ సివిల్‌ జడ్జిల భవిష్యత్‌ ఫలప్రదంగా ఉండాలని జిల్లా జడ్జి సునీత కుంచాల ఆకాంక్షించారు. బదిలీపై వెళుతున్న జడ్జిలను అసోసియేషన్‌ సభ్యులు సన్మానించారు. అదనపు జిల్లా జడ్జిలు కనకదుర్గ, షౌకత్‌ జహాన్‌ సిద్ధికి, సీనియర్‌ సివిల్‌ జడ్జిలు శ్రీకాంత్‌ బాబు, పద్మావతి, బార్‌ అధ్యక్షుడు దేవదాసు, ఉపాధ్యక్షుడు ఆశ నారాయణ, ప్రధాన కార్యదర్శి భాగి చరణ్‌, రాజేందర్‌రెడ్డి, రజిత, ప్రవీణ, ఝాన్సీ, కృపాకర్‌ రెడ్డి పాల్గొన్నారు.

జేఈఈ మెయిన్స్‌లో గురుకుల విద్యార్థినుల ప్రతిభ



జేఈఈ అడ్వాన్స్‌కు అర్హత సాధించిన గురుకుల విద్యార్థినులతో ప్రిన్సిపాల్‌ సంగీత, అధ్యాపకులు

జేఈఈ అడ్వాన్స్‌కు 16మంది అర్హత

డిచ్‌పల్లి: మండలంలోని ధర్మారం(బి) తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల బాలికల ప్రతిభ కళాశాల (సీవోఈ) విద్యార్థినులు జేఈఈ మెయిన్స్‌లో ప్రతిభ చాటినట్లు ప్రిన్సిపాల్‌ బి సంగీత సోమవారం తెలిపారు. ఇటీవల ఇంటర్‌ పూర్తి చేసిన విద్యార్థినుల్లో 37 మంది మెయిన్స్‌ పరీక్షకు హాజరు కాగా 16 మంది జేఈఈ అడ్వాన్స్‌కు అర్హత సాధించినట్లు తెలిపారు. అర్హత సాధించిన వారు.. ఆర్‌ ధనలక్ష్మి (87.84), ఎస్‌ సాహితి (85.01), జీ నిహారిక (81.14), సౌందర్య (80.50), దివిజ (77.64), సిరివెన్నెల (76.49), చామంతి (75.78) పర్సంటైల్‌ సాధించినట్లు ఆమె చెప్పారు. విద్యార్థులను సంస్థ ఆర్‌సీవో మేరీ యేసుపాదం, ప్రిన్సిపాల్‌ సంగీత, అధ్యాపకులు అభినందించారు.

ఓపెన్‌ వరల్డ్‌ మిక్స్‌ బాక్సింగ్‌కు ఎంపిక



నిజామాబాద్‌నాగారం: జమ్మూ కాశ్మీర్‌లో ఈ నెల 5 నుంచి 7 వరకు జరిగే ఓపెన్‌ మిక్స్‌ వరల్డ్‌ బాక్సింగ్‌ చాంపియన్‌షిప్‌కు జీజీ కళాశాల విద్యార్థి శ్రీకాంత్‌(డిగ్రీఫైనల్‌) ఎంపికయ్యారు. సోమవారం శ్రీకాంత్‌ను కళాశాల ప్రిన్సిపాల్‌ రామ్మోహన్‌రెడ్డి, పీడీ బాలమణి, కోచ్‌ శ్రీనివాస్‌ అభినందించారు.

పోయిన ఫోన్ల రికవరీ



బాధితుడికి సెల్‌ ఫోన్‌ను అందజేస్తున్న సదాశివనగర్‌ ఎస్సై రాజేశ్‌

సదాశివనగర్‌: పోయిన ఫోన్‌ను సీఈఐఆర్‌ అప్లికేషన్‌ ద్వారా పట్టుకోవచ్చని ఎస్సై రాజేశ్‌ తెలిపారు. ఇటీవల ఫోన్‌ను పోగొట్టుకున్న భానుప్రకాశ్‌ అనే యువకుడికి సీఈఐఆర్‌ ద్వారా పట్టుకొని అప్పగించినట్లు ఎస్సై తెలిపారు. ఎవరి ఫోన్‌లు మిస్‌ అయినా పోర్టల్‌లో నమోదు చేయాలన్నారు.

నిజామాబాద్‌సిటీ:నిజామాబాద్‌ రూరల్‌ పోలీస్‌స్టేషన్‌ పరిధి బైపాస్‌రోడ్డులో ఇద్దరు వ్యక్తులు పోగొట్టుకున్న సెల్‌ఫోన్లను పోలీసులు బాధితులకు అప్పగించారు. నాగర్‌ కర్నూల్‌కు చెందిన మల్లేష్‌, మాణిక్‌భండార్‌కు చెందిన వెంకటేశం ఫోన్లు బైపాస్‌రోడ్డులో పడిపోయాయి. వారు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు సీఈఐఆర్‌ సాంకేతికతను ఉపయోగించి పోయిన ఫోన్ల జాడను కనుగొని రికవరీ చేశారు. సోమవారం ఫోన్లను బాధితులకు అప్పగించటంతో వారు రూరల్‌ ఎస్సై లింబాద్రి, పోలీసులకు కృతజ్ఞతలు తెలిపారు.

రసవత్తరంగా కుస్తీ పోటీలు



బహుమతి అందజేస్తున్న నిర్వాహకులు

నిజాంసాగర్‌: పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి ఆరాధన ఉత్సవాల్లో భాగంగా సోమవారం మండల కేంద్రంలోని బంజపల్లి గ్రామ పంచాయతీలో కుస్తీపోటీలు నిర్వహించారు. కుస్తీ పోటీలకు చుట్టుపక్కల మండలాలతో పాటు మహారాష్ట్ర, కర్ణాటక ప్రాంతాల నుంచి మల్లయోధులు తరలివచ్చారు. దాంతో కుస్తీ పోటీలు హోరాహోరీగా సాగాయి. కుస్తీ పోటీల్లో గెలుపొందిన మల్లయోధులకు గ్రామ పెద్దలు నగదు బహుమతి అందజేశారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు సందీప్‌, బేగరి రాజు, లింగాగౌడ్‌, సత్యాగౌడ్‌, విజయ్‌, రాములు, రాజు, సాయిలు ఉన్నారు.

సమాజాన్ని జాగృతపర్చడానికి నైపుణ్యం అవసరం



ఖలీల్‌వాడి: సమాజాన్ని జాగృత పర్చడానికి నైపుణ్యం అవసరమని నగర మేయర్‌ నీతూకిరణ్‌ అన్నారు. సోమవారం నగరంలోని కిసాన్‌ గంజ్‌లోని ఓ హోటల్‌లో ట్రెయిన్‌ ది ట్రెయినర్స్‌ వర్క్‌ షాప్‌ నిర్వహించారు. నీతూకిరణ్‌ మాట్లాడుతూ ఇంఫాక్ట్‌ సర్టిఫైడ్‌ ట్రైనర్‌ ఒకప్పుడు హైదరాబాద్‌కు పరిమితమైందని, ఇప్పుడు నిజామాబాద్‌కు రావడం సంతోషదాయకమన్నారు. ఇంటికొక స్పీకర్‌ – ఊరుకొక ట్రెయినర్‌ అనే ఆశయ సాధనలో భాగంగా కార్యక్రమం ఏర్పాటు చేసినట్లు ఉమ్మడి నిజామాబాద్‌ ట్రెయినర్‌ పుజ్జ నరేందర్‌ తెలిపారు. లాబిశెట్టి మహేష్‌, నక్క నవీన్‌ తదితరులు పాల్గొన్నారు.

జీజీహెచ్‌లో యువకుడి ఆత్మహత్యాయత్నం



గొంతు కోసుకున్న ఖలీం

నిజామాబాద్‌ సిటీ: నిజామాబాద్‌ ప్రభుత్వ ఆస్పత్రిలో ఓ యువకుడు సోమవారం ఆత్మహత్యాయత్నం చేశాడు. నగరంలోని నిజాంకాలనీకి చెందిన ఖలీం గతంలో ఆస్పత్రిలో అవుట్‌ సోర్సింగ్‌ పద్ధతిలో పారిశుధ్య పనులు చేసేవాడు. ఇతని ప్రవర్తన సరిగ్గా లేక పోవటంతో పనిలోనుంచి తొలగించారు. కాగా ఇతని తల్లి ప్రస్తుతం ఇదే ఆస్పత్రిలో స్వీపర్‌గా పనిచేస్తోంది. ఖలీం తనను పనిలో నుంచి తొలగించిన విషయంలో పలుమార్లు సూపరింటెండెంట్‌ చాంబర్‌కు వచ్చి సిబ్బందితో గొడవపడేవాడు. సోమవారం ఖలీం సూపరింటెండెంట్‌ చాంబర్‌కు వచ్చి అక్కడి సిబ్బందితో గొడవ పడి తన వెంట తెచ్చుకున్న బ్లేడ్‌తో గొంతు కోసుకున్నాడు. అక్కడివారు వెంటనే అతడిని వార్డుకు తరలించగా వైద్యులు చికిత్స అందించారు. ఈ ఘటనపై ఒకటోటౌన్‌ పోలీసులు ఖలీంపై కేసు నమోదు చేశారు.

అనుమానాస్పద స్థితిలో వృద్ధుడి మృతి

నవీపేట: మండలంలోని జగ్గారావుఫారం సమీపంలో మహంకాళి రాములు(66) అనుమానాస్పద స్థితిలో మృతి చెందినట్లు ఎస్సై రాజారెడ్డి సోమవారం సాయంత్రం తెలిపారు. హైదరాబాద్‌కు చెందిన మహంకాళి రాములు భార్యతో విడిపోయి కొన్ని రోజులుగా నిజామాబాదులోని కూతురు దగ్గర ఉంటున్నాడు. ఆరు నెలల నుంచి దూపల్లికి చెందిన సయ్యద్‌ నాజీబ్‌ అలీ దగ్గర వాచ్‌మన్‌గా పని చేస్తున్నాడు. జగ్గారావు ఫారం శివారులోని ఆయన వెంచర్‌ దగ్గర రాములు ఉంటున్నాడు. గత నెల 26 నుంచి కనిపించకుండా పోయిన రాములు సోమవారం జిగరవపాలెం శివారులో శవమై కనిపించాడు. కూతురు గడ్డం లావణ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఎస్సై తెలిపారు.

బైక్‌పై వెళ్తుండగా కొమ్మ పడి గాయాలు



గాయపడ్డ సంగారెడ్డి

ఎల్లారెడ్డిరూరల్‌: మండలంలోని మల్లయ్యపల్లి శివారులో బైక్‌పై వెళ్తున్న వారిపై ప్రమాదవశాత్తు చెట్టు కొమ్మ పడడంతో ఇద్దరికి తీవ్ర గాయాలైనట్లు స్థానికులు తెలిపారు. సోమవారం ఉదయం సంగారెడ్డి జిల్లా నిజాంపేట్‌ మండలం జంబికుంట గ్రామానికి చెందిన తాటిపాండ సంగారెడ్డి, తన మనవడు హిమవంత్‌రెడ్డిని నాగిరెడ్డిపేట మండలం తాండూర్‌లో తన కూతురు వద్దకు దింపేందుకు బైక్‌పై బయలుదేరాడు. మల్లయ్యపల్లి శివారులో మర్రి చెట్టుకొమ్మపైన పడడంతో సంగారెడ్డి చేతి విరిగి తలకు తీవ్ర గాయాలు కాగా హిమవంత్‌రెడ్డికి సైతం గాయపడ్డాడు. స్థానికులు 108లో వారిని ఎల్లారెడ్డి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. సంగారెడ్డికి తీవ్ర గాయాలు కావడంతో అతడిని హైద్రాబాద్‌కు రిఫర్‌ చేసినట్లు వైద్యులు తెలిపారు.


ట్రాక్టర్‌, బైక్‌ ఢీకొన్న ఘటనలో ఒకరికి..

పిట్లం: పిట్లంలోని రాజరాజేశ్వర్‌ ఫంక్షన్‌ హాల్‌ ఎదురుగా జాతీయ రహదారిపై ఉన్న బ్రిడ్జి వద్ద సోమవారం ట్రాక్టర్‌, బైక్‌ ఢీకొని ఒకరికి గాయాలు అయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాలు.. కంగ్టి మండలం నాగూర్‌ గ్రామానికి చెందిన మోజేస్‌ పిట్లం వస్తుండగా ట్రాక్టర్‌ ఢీకొంది. క్షతగాత్రుడిని చికిత్స నిమిత్తం హైవే అంబులెన్స్‌లో మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

క్రైం కార్నర్‌

దారి తప్పి మృత్యుఒడికి..

- బడాపహాడ్‌ వెళ్తుండగా రోడ్డు ప్రమాదం
- తండ్రీకూతురు మృతి
- మృతులు మహారాష్ట్రవాసులు



రుద్రూర్‌: బడాపహాడ్‌ దర్శనానికి వెళ్తున్న వారు దారి తప్పి మృత్యుఒడికి చేరుకున్నారు. వర్ని మండలం శ్రీనగర్‌ సమీపంలో సోమవారం బస్సు, బైక్‌ ఢీకొన్న ఘటనలో మహారాష్ట్రలోని బిలోలి తాలూకా అద్దాంపూర్‌కు చెందిన తండ్రీకూతురు మృతి చెందారు. ఏఎస్సై నాగభూషణం తెలిపిన వివరాలు.. మహారాష్ట్రకు చెందిన మౌలాసాబ్‌(45), ఆయన కూతురు అన్సరా(10) బైక్‌పై బడాపహాడ్‌ బయలు దేరారు. వారి కుటుంబ సభ్యులు ఆటోలో బడాపహాడ్‌ వెళ్లారు. వెనుకాల వెళ్లిన మౌలాసాబ్‌, అన్సర దారి మరిచి పోయి శ్రీనగర్‌ వైపు వెళ్లారు. ఈ క్రమంలో బస్సు, బైక్‌ ఢీకొన్నాయి. ప్రమాదంలో శాదుల్‌ మౌలాసాబ్‌ అక్కడికక్కడే మృతి చెందాడు. తీవ్రంగా గాయపడ్డ అన్సరాను పోలీస్‌ వాహనంలో బోధన్‌ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందింది.

ఆటో బోల్తా : పలువురికి గాయాలు

ఆర్మూర్‌టౌన్‌: ఆర్మూర్‌ పట్టణంలోని సుభాష్‌ నగర్‌ వద్ద సోమవారం ఆటో బోల్తాపడిన ఘటనలో ప్రయాణికులు స్వల్ప గాయాలతో బయటపడ్డారు. వివరాలు.. ఆర్మూర్‌ నుంచి ఆలూర్‌కు ప్రయాణికులతో వెళ్తున్న ఆటో రోడ్డుపై కుక్క అడ్డు రావడంతో అదుపు తప్పి బోల్తా పడింది. ఈ ఘటనలో ఆటోలో ప్రయాణిస్తున్న ఆలూర్‌, గగ్గుపల్లి గ్రామాలకు చెందిన ఐదుగురికి స్వల్ప గాయాలయ్యాయి. క్షతగాత్రులను 108 అంబులెన్సులో పట్టణంలోని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

గల్లంతైన వృద్ధుడి మృతదేహం లభ్యం



సంగ్యానాయక్‌ (ఫైల్‌)

రాజంపేట: మండలంలోని ఎల్లారెడ్డిపల్లి తండా చెరువులో గల్లంతైన సంగ్యానాయక్‌ మృతి చెందాడు. సోమవారం ఆయన మృతదేహం లభ్యమైంది. వివరాలు.. ఎల్లారెడ్డిపల్లి గ్రామానికి చెందిన జింక నర్సింలు ఆత్మహత్య చేసుకోడానికి చెరువులో దూకగా ఆయనను కాపాడటానికి వెళ్లిన సంగ్యానాయక్‌ గల్లంతైన విషయం తెలిసిందే. ఆదివారం గాలించినా ఆచూకీ లభించకపోవడంతో సో మవారం మళ్లీ గాలించగా మృతదేహం లభించినట్లు ఎస్సై రాజు వెల్లడించారు.సంగ్యానాయక్‌ భార్య బూరీ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామన్నారు.

బడాపహాడ్‌లో గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం

రుద్రూర్‌: వర్ని మండలం బడాపహాడ్‌లో గుర్తు తెలియని వ్యక్తి మృతదేహాన్ని(40) సోమవారం స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. ఏఎస్సై నాగభూషణం ఆధ్వర్యంలో పోలీసులు ఘటన స్థలానికి వెళ్లి మృతదేహాన్ని పరిశీలించారు. మృతుడి జేబులో లభించిన చీటీలో షేక్‌ అయ్యూబ్‌, ఔరంగబాద్‌ అని ఉన్నట్లు పోలీసులు తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.